క్లుప్తంగా

రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అరికట్టాలి


ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి బదులుగా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ జేసీఎస్ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. కొత్త ప్రభుత్వంలో 31 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు హత్యకు గురవ్వగా, మరో 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మూడు వేల మందిపై దాడులు జరిగాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని వెంటనే అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి పుంగనూరు పర్యటనలో ఉండగా ఆయనపై టీడీపీ నాయకులు రాళ్లు రువ్వడాన్ని స్టాలిన్ ఖండించారు. వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు రషీద్‌ను కత్తితో నరకడం చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేదా అనే అనుమానం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇన్ని దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ జోక్యం చేసుకొని రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్టాలిన్ కోరారు.

ఏపీడబ్ల్యూడబ్ల్యూఎస్‌ఏ జనరల్ కార్యదర్శిగా ప్రవీణ్


ప్రవీణ్

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల అసోసియేషన్ (ఏపీడబ్ల్యూడబ్ల్యూఎస్‌ఏ) జనరల్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన 7వ వార్డు సచివాలయ అడ్మిన్ బి.హనీ ప్రవీణ్ ఎంపికయ్యారు. గురువారం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు గ్రూపులుగా వార్డ్ వెల్‌ఫేర్ అసోసియేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా కమిటీలో చేరాల్సిన సచివాలయ మిత్రులు ఉంటే అసోసియేషన్‌లో చేరాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది సమస్యలపై నూతన కోర్ కమిటీ సభ్యులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందించామన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలి


విద్యా సామగ్రి అందజేస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్, తదితరులు

పోడూరు: ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్, దాత దేవళ్ల ప్రసాద్ అన్నారు. జిన్నూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గ్రామానికి చెందిన 'మన కోసం మనం' సేవా సంస్థ ఆధ్వర్యంలో దాత దేవళ్ల ప్రసాద్ ఆర్థిక సాయంతో గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆయనతో పాటు సేవాసంస్థ అధ్యక్షుడు పడాల పెద్దిరాజు, పాఠశాల హెచ్ఎంల చేతులమీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సేవాసంస్థ అధ్యక్షుడు పెద్దిరాజు మాట్లాడుతూ దాతల సహకారంతో తమ సేవా సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం దాత ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, కలిశెట్టి లక్ష్మి, పడాల కృష్ణవేణి, సిద్ధార్థ, ఉదయ్, కేతలి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతో రక్త హీనత


మాట్లాడుతున్న జిల్లా అధికారి సుజాతారాణి

పెనుగొండ: పౌష్టికాహార లోపంతో కిషోర్ బాలికల్లో రక్త హీనత ఏర్పడుతుందని, ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అభివృద్ధి అధికారి బి.సుజాత రాణి అన్నారు. గురువారం ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 రోజుల పౌష్టికాహారం, రక్త హీనత సంరక్షణ చట్టాలు, హక్కులు కార్యక్రమంలో కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపంతో ఎదుగుదల సమస్య, మహిళల్లో రక్త హీనత వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీల్లో సకాలంలో పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీపీవో ఎ.కృష్ణకుమారి, ఎంఈవో ఉషారాణి, సూపర్‌వైజరు శ్యామలాంబ పాల్గొన్నారు.

రైతన్నను నిండా ముంచిన వాన

ముంపునకు గురైన వరి నారుమడులు

నరసాపురం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండలంలో పలుచోట్ల నారుమడులు నీట మునిగాయి. ఇప్పటికే ఒక దఫా నారుమడులు నీట మునగడంతో వాటిని రక్షించే పనిలో భాగంగా రైతులు మోటర్ ఇంజన్లు, కారేల సాయంతో నారుమడుల్లో నీటిని బయటకు మళ్లించే పనులు చేపట్టారు. అయితే తాజాగా గత నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షంతో చిట్టవరం, రుస్తుంబాద, పసలదీవి, మల్లరం, సరిపల్లి గ్రామాల్లో పొలాల్లో మళ్లీ ముంపు నీరు భారీగా చేరి లాగకపోవడంతో ఇటీవల వేసిన సార్వా నారుమడులు రెండోసారి నీట మునిగాయి. చిట్టవరంలో వర్షపునీటి ముంపునకు తోడు జమ్ము కాలువ, మల్లవరంలోని ముగురు కాలువ, దర్బరేవు మురుగు కాలువలు నీటిని లాగకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి పంట చేలల్లోకి నీరు ఎగదన్నుతుంది. ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు తోడు బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలతో మరింత నీట మునిగాయి. అల్పపీడన ప్రభావంతో మరింతగా వానలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంటుంది. దీంతో నారుమడులు వేసిన రైతులంతా లబోదిబోమంటున్నారు. గ్రామాల్లో పలుచోట్ల రోడ్లపై ఉన్న గోతుల్లో నీళ్లు నిలబడి ఉండటంతో ప్రయాణానికి అసౌకర్యంగా ఉంది. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో ఎడతెరిపి లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. మరో రెండు రోజులు ముంపు ఇలానే కొనసాగితే నారు కుళ్లిపోయే దశకు చేరుకుంటుందని రైతులు వాపోతున్నారు. సార్వా పంటపై వరుణ దేవుడు కనికరించకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. నీటిలో మునిగి తేలియాడుతున్న వరి నారు మడులను రక్షించుకునేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలన్నీ ఇన్నీ కావు. ఇప్పటికే నారుమడులు ఆలస్యం కాగా ముంపు బారిన పడిన నారు పాడైపోతే మళ్లీ తిరిగి నారుమడులు పోసి నాట్లు వేయాలంటే దాళ్వాసాగుకు ఆటంకం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. దీంతో ముంపు బారిన పడిన నారుమడులను దక్కించుకునేందుకు రైతులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.


ఎల్బీచర్లలో ముంపునకు గురై చెరువును తలపిస్తున్న సార్వా నారుమడులు, వరి చేలు


యలమంచిలిలో నీట మునిగిన నారుమడిని పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు


మట్టపర్రులో వరి నారుమడులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ

70 ఎకరాలలో నారుమడుల మునక

యలమంచిలి: అధిక వర్షాలకు మండలంలో 70 ఎకరాలలో నారుమడులు మునిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి చెప్పారు. నరసాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారితో కలిసి గురువారం ఆమె మండలంలోని పలు గ్రామాలలో నీట మునిగిన నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా అనిలకుమారి రైతులతో మాట్లాడుతూ నారుమడి నీటిలో మునిగిన 5 రోజుల వరకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. 5 రోజులకు పైబడి నీటిలో ఉంటే నీరు తీసిన వెంటనే నారుమడికి బాగా గాలి తగిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేయాలని సూచించారు. దీని వలన కొత్త ఆకు వస్తుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి మాట్లాడుతూ ఎంటీయూ-1064 ఫౌండేషన్ విత్తనాలు గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద 50 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు.

నారుమడుల పరిశీలన

పోడూరు: అధికవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ గురువారం పలు గ్రామాల్లో వరి నారుమడులను పరిశీలించారు. పోడూరు, మట్టపర్రు, కవిటం, జిన్నూరు తదితర గ్రామాల్లో ఆయన వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా వరినారు మడులకు గాని, వరినాట్లకు గాని ఎటువంటి నష్టం కలుగలేదన్నారు. వర్షాలు ఒకటి, రెండు రోజులు ఏకధాటిగా కురిస్తే నారుమడులు, వరినాట్లు నీటమునిగే ప్రమాదం ఉందని రైతులను అప్రమత్తం చేశారు. నారుమడుల్లో నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడాలని రైతులకు సూచించారు. మరీ ఆలస్యమైతే వరినారు మడులు కుళ్లిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారి అన్నారు. వీఏఏలు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

రోడ్లు జలమయం


నీట మునిగిన రహదారులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో గురువారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. గురువారం వేకువ జాము నుంచి వర్షం కురుస్తుండడంతో వ్యాపారాలు, జన సంచారం ఎక్కడికక్కడ స్తంభించాయి. పట్టణ శివారు ప్రాంతంలో వర్షం నీటితో రోడ్లు జలమయమయ్యాయి. స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు, పాత బ్యాంక్ కాలనీ ప్రాంతంలో పనసరామయ్యతోట ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోయాయి. పట్టణంలో కొంత కాలంగా సమస్యగా ఉన్న ప్రధాన డ్రెయినేజీల్లో సిల్ట్ సమస్యపై మున్సిపల్ కమిషనర్ విజయసారథి ఇటీవల ఎన్నికల కోడ్ సమయంలో ప్రత్యేక దృష్టి పెట్టడంతో నేడు ఎంత వర్షం కురిసినా బస్టాండ్ సెంటర్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వ్యాపారులు ఇప్పటి వరకూ ఏ కమిషనర్ చేయని పనిని ప్రస్తుత కమిషనర్ చేశారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ సెంటర్లో మోకాలు లోతులో నీళ్లు ఉండేవన్నారు. నేడు ఎంత వర్షం కురిసినా ఆ పరిస్థితి లేదని వ్యాపారాలు చక్కగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో కమిషనర్ పట్టణంలో ప్రధానంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సిల్ట్ తీయించడంతో నేడు ఆ సమస్య కొంతవరకూ పరిష్కారం అయినట్లు పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై వర్షపు నీటితో ప్రజల ఇక్కట్లు


రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

మొగల్తూరు: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారులలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 29, 30 తేదీలలో 61.2 మిల్లీ మీటర్లు, ఈ నెల 3న 35 మిల్లీ మీటర్లు, 5న 35.2 మిల్లీ మీటర్లు, 16, 17 తేదీల్లో 55.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అంతే కాక గురువారం ఉదయం నుండి వర్షం కురుస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని ప్రధాన రహదారులైన గొల్లగూడెం రోడ్డు, స్టేషన్ రోడ్డు, రామాలయం నుంచి కోట మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ), విజయవాడ ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ వారి సంయుక్త సౌజన్యంతో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ న్యూ ఢిల్లీ వారి సౌజన్యంతో నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ (ఎన్ఎస్ఎస్‌హెచ్) స్కీమ్ ద్వారా మెషీన్ ఆపరేటర్, ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అనే నైపుణ్యాభివృద్ధి శిక్షణను 5 నెలలు ఇస్తారన్నారు. అనంతరం వారికి సర్టిఫికేట్, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల్లో ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు అందిస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత, 18 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత అర్హులన్నారు. పూర్తి వివరాలకు కె.సుందరరావు 9398050255 నెంబర్‌లో సంప్రదించి, దరఖాస్తులు పూర్తి చేసుకోవాలన్నారు.

హెల్మెట్ ధారణే శ్రీరామ రక్ష


హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అవగాహన ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

పాలకొల్లు సెంట్రల్: మనతో పాటు మన కుటుంబం ఆనందోత్సాహాలతో ఉండాలంటే ప్రతీ ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధారణే ప్రాణానికి శ్రీరామ రక్షని పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తలుపుల శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలనే అంశంపై స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి పట్టణ పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి యజమానిపై భార్య, పిల్లలు, తల్లి దండ్రులు ఆధారపడి ఉంటారన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎంతమంది నష్టపోతారో ఆలోచించుకోవాలన్నారు. అందువల్ల ప్రతీ ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కె.మంగాదేవి, పోడూరు ఎస్సై రామ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు

నరసాపురం: హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ఆకస్మిక ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అన్నారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఒన్‌కే వాక్ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి శివాలయం సెంటర్ వరకూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయదుర్గ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఉన్నత న్యాయస్థానాలు కూడా ఇటీవల ఆర్డర్ పాస్ చేశాయని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి జి.గంగరాజు, జూనియర్ డివిజన్ సివిల్ జడ్జిలు ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా దానయ్యనాయుడు, ఆర్‌జీ కుమార్, స్వర్ణాంధ్ర, సూర్యా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు


పారిశుద్ధ్యంపై సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది కాబట్టి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ విజయసారథి శానిటరీ అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం శానిటరీ, ఇంజనీరింగ్, సచివాలయ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే పట్టణంలో బస్టాండ్ సెంటర్ మోకాలు లోతులో నీరు ఉండేదన్నారు. ఇటీవల బస్టాండ్ సెంటర్, బెజవాడ కోడు, లజపతిరాయ్‌పేట ప్రాంతాల్లో డ్రెయినేజీలో సిల్ట్ తొలగించామన్నారు. ప్రస్తుతం పట్టణంలో వర్షం నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదన్నారు. శానిటరీ అధికారులు, సచివాలయ సెక్రటరీలు తమ వార్డు పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో డీఈ రాజ్‌కుమార్, ఏఈలు సాంబశివుడు, సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు


ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇస్తున్న ఎంఈవో వీరాస్వామి

పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయులకు విద్యా బోధన, బోధనలో నాణ్యత, పాఠ్యాంశాల నిర్వహణ, పాఠశాల సంస్కృతిపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని మండల విద్యాశాఖ అధికారి గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. గురువారం స్థానిక బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ అబ్జర్వర్స్ ట్రైనింగ్ 3వ ఫేజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వీరాస్వామి మాట్లాడుతూ విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి ఆదేశాల ప్రకారం ఈ నెల 18 నుంచి 27 వరకూ తొమ్మిది రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. శిక్షణ తరగతుల్లో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి, మొగల్తూరు, నరసాపురం, ఆచంట మండలాల నుంచి 105 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు తమ మండల పరిధిలో ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన పద్ధతుల్లో నాణ్యత, అభ్యసన సమయం, గది సంస్కృతి, పాఠ్యాంశాల నిర్వహణపై అవగాహన, సానుకూల అభ్యాసన ప్రక్రియలు, గుణాత్మక ఆలోచనలు మొదలైన అంశాలపై పరిశీలన చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కె.లక్ష్మీనగేష్, వి.లక్ష్మీ నారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, వేణుగోపాలాచార్యులు, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలే


మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకొని వాటిని పూర్తిగా వ్యతిరేకించాలని జిల్లా మిషన్ శక్తి వన్‌స్టాప్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ కోరారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో డాక్టర్ సబితా మహిళా జూనియర్ కళాశాలలో పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన మిషన్ శక్తి పథకం వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలు టోల్ ఫ్రీ నెం 181కు ఫోన్ చేయాలని సూచించారు. మహిళా చట్టాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రేమిస్తున్నానని, లేదా పెళ్లి చేసుకుంటానని మోసం చేసే యువకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వసంతలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎస్.మల్లేశ్వరి, ఏఎన్ఎం ఆర్.భాగ్యలక్ష్మి, శిరిగినీడి వెంకటనాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగలక్ష్మి, బి.భాగ్యలక్ష్మి, ఆర్.సురేఖ, ఎం.చంద్రకాంత, తదితరులు పాల్గొన్నారు.

దగ్గులూరులో....

ఐసీడీఎస్, పాలకొల్లు ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా దగ్గులూరులో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. మహిళా చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.మంగ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, హెచ్ఎం శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి, సీహెచ్ దుర్గ, బి.ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కట్టుపాలెంలో బేటీ బచావో-బేటీ పఢావో


విద్యార్థులకు మహిళా శక్తి గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా


యలమంచిలి: బాలికల విద్యా ప్రాముఖ్యత, లింగ సమానత్వం పెంపునకు బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. కట్టుపాలెంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు గురువారం ఆమె బేటీ బచావో-బేటీ పఢావో 100 రోజుల అవగాహన కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. మహిళా సాధికారిత, మహిళల భద్రత, ప్రభావితం చేసే సమస్యలను వివరించి వాటిని ఎలా ఎదుర్కోవాలో విశదీకరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.శేషసాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంజేఆర్ కుమారి, కె.జ్యోతి, ఆశ కార్యకర్తలు జి.రాజమణి, పి.దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు


డీపీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ నాయకులు

యలమంచిలి: నూతనంగా ఎన్నికైన పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని అభినందించిన విక్టర్ సంఘ పటిష్టతకు పాటు పడుతూనే, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. విక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దొంగ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పాలా శారదా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవాబత్తుల నాగదేవి, కోశాధికారి సుంకర వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకంతో అభివృద్ధి


పెనుగొండలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: జాతీయ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధిని చేసుకోవచ్చని డ్వామా పీడీ, సామాజిక తనిఖీ ప్రజా వేదిక ప్రిసైడింగ్ అధికారి ఎం.ప్రభాకర రావు అన్నారు. గురువారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో జనవరి 2024 నుంచి జూన్ వరకూ చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మినీ గోకులాల పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. మండలంలో 1325 పనులకుగాను రూ.3,61,13, 572 ఖర్చు చేసినట్లు వివరించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మినీ గోకులాలు వంటి 17 పనులకు గాను రూ.1,29,71,319 ఖర్చు చేశారన్నారు. గ్రామీణ నీటి సరఫర పనులకు గాను రూ.28,020 ఖర్చు చేశారని వివరించారు. 8889 మంది సామాజిక భద్రతా పింఛన్‌దారులను పరిశీలించామన్నారు. పథకంలో రూ.63,429 దుర్వినియోగం కాబడినట్లు గుర్తించి, వాటిని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సహాయకులు, ఎకౌంటు సహాయకుల నుంచి రికవరీ చేయవలసిందిగా ఆదేశించినట్లు తెలిపారు. మస్తర్లు తప్పుగా నమోదు చేసిన వారికి రూ.5,500 అపరాధ రుసుం విధించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుందం శ్రీనివాస దొర, జిల్లా విజిలెన్సు అధికారి విజయలక్ష్మీ, ఏపీడీ పి.సురేష్ బాబు, డీపీఎం టి.మురళీ కృష్ణ, ఎస్ఆర్‌పీ ఎం.గోవిందు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.